

పింగళి రమాదేవి

దేవదాసు పార్కులోనించి బయటికి వచ్చాడు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. వెన్నెల మసకమసకగా వ్యాపించింది. దూరంగా ఉన్న కాకాహోటల్లోంచి హిందీపాటలు వినిపిస్తున్నాయి. 'టైమెంతవుతుందో!' అనుకొన్నాడతను. టైము తెలుసుకొనేందు కతనికి అవకాశం లేదు. షాపులన్నీ మూసివేశారు. ఒక్కళ్ళు కూడా రోడ్డుమీద నడవటం లేదు. మెల్లిగా ఇంటివైపు అడుగులు వేయసాగాడతను. ఊరు నిద్రపోతూంది. అంతా నిశ్శబ్దం. ఏ రెండయిందో, మూడయిందో టైము. వీధుల్లోని ఎలక్ట్రిక్ దీపాలు కొన ఊపిరితో వెలుగుతున్నాయి.

'శ్మశానంలా ఉంది ఊరు!' నవ్వుకొన్నాడు దేవదాసు. కానీ పాగి ఇంకొంచెం గట్టిగా నవ్వేశాడు. రోడ్డుపక్కన పడు

# నరకం

( 35 వ పేజి తరువాయి)

ఉండను. మనం వేరే కాపరం పెడితేనే తిరిగివస్తాను. అందాకా అక్కడే ఉంటాను" అంటూ పెళ్ళాడి, పిల్లల్ని ఎత్తుకొని వాళ్ళ ఊరు వెళ్ళిపోయింది.

తనేం మాట్లాడలేదు ఆమె అంటూన్న మాటలు వింటూ, చేస్తున్న చేష్టలు చూస్తూ ఊరుకుండి పోయాడు. అంతకంటె చేయగలిగిం దేముందీ? ఆమె అన్న మాటల్లో ఏమి అబద్ధం ఉందనీ? నరుసు నగలన్నీ తన చేతులతోనే తాకట్టు పెట్టాడు. ఇంకేదు పనులూ దాని మీద రుద్ది, దాన్ని ఓ పనిమనిషికంటె అన్యాయంగా తయారుచేశాడు. ఏ నాడూ రెండు చీరలకంటె ఎక్కువ లేవు దానికి. తిండికూడా ఒకోసారి కడుపు నిండా దొరకదు. పిల్లలకి సరయిన బట్టలు లేవు. . . ఇదంతా ఎందుకిలా అయింది? తను పెళ్ళాడటం తప్పా?

నరుసు మెల్లిగా లేచి కూర్చుంది. అప్పటికి తెల్లవారింది. లాంతరు ఆర్పివేసి వంటింటి వేపు నడిచింది.

ఆమె నడకలో మొదట్లో తను చూసిన అందం లేదే! దేవతలాంటి నరుసు ఇలా చిక్కి, కఠినంగా తయారవడానికి తనే కారణం. తన అంతరాత్మకి తెలుసు. అందుకే ఆమె మాటను మన్నించి వేరే కాపరం పెట్టాడు. లేపోతే ఓ ఆడకూతురు ఉసురు తగులుతుంది తనకి. నరుసు కన్నీళ్ళు పెడితే ఎవ్వరికీ జయం కలుగదు. అదలా రెచ్చిపోవడానికి కారణం — అమ్మ, అక్కయ్య. అక్కయ్య కెందుచేతో నరుసుని చూస్తే అసలు పడేది కాదు. వేరుపడినప్పటి నుంచీ తన పని మరీ ఇరకాటమయి పోయింది. రెండు కుటుంబాలని భరించడం మాటలు కాదు.

అందిన చోటల్లా అప్పులవుతున్నాయి. తన నగలు తనకు తీసుకువచ్చి ఇమ్మంటూ రోజూ గొడవ చేస్తూంది నరుసు. తను మాట్లాడకుండా ఊరుకొంటున్నాడు. ఇంటికి వచ్చేసరికి ఎన్ని బాధల్లో ఉన్నా, నరుసు కాస్సేపు తనతో మాట్లాడితే సేద తీరినట్లుండేది. ఆమె తనని దగ్గిరికి తీసుకొని ఓదారిస్తే, కనీసం ఆ కాసేపు మిగతా ప్రపంచాన్ని మరిచిపోయేవాడు. కానీ నగలు విడిపించలేదన్న కోపంతో తనతోసరిగ్గా మాట్లాడడం మానేసింది. గుర్తువచ్చినప్పుడల్లా ఏడుస్తూ కూర్చుంటుంది. ఇంట్లో ఇద్దరూ కొత్తవ్యక్తుల్లా మసులుతున్నారు.

"ఎప్పుడూ మీ అమ్మా, మీ చెల్లాయీ, మీ తమ్ముడూ అనుకొంటూ కూర్చుంటే మన పిల్లల గతేమిటి? మన పెద్దదానికి ఒక్క నగయినా ఉండక్కర్లేదా? వీళ్ళకిక ఎప్పుడూ ఆ చిరిగిన బట్టలేనా? వీళ్ళకి కడుపునిండా మనం తిండి పెట్టేదెప్పుడు? మా అందరికీ ఇంత విషం పెట్టేయకూడదూ, మీ కే బాధా ఉండదు?"

బిగ్గరగా నవ్వాడు దేవదాసు.

'నరకం ఏ మూలకి తన కుటుంబం ముందు? యమధర్మరాజుని తీసుకువచ్చి తన ఇల్లోసారి చూపిస్తే ఇక చస్తే తను ఎవ్వరి జోలికీ రాడు. ఇకనుంచీ ఎక్కువ పాపాలు చేసినవాళ్ళందరినీ నరకానికి తీసుకెళ్ళడం మానేసి తనింటికి పంపిస్తాడు. కొంచెం పాపం చేసినవాణ్ణి వారం రోజులు దేవదాసుగా బ్రతకమనీ, ఎక్కువ పాపం చేసినవాణ్ణి నెల రోజులు దేవదాసు జీవితం అనుభవించమనీ శిక్షలు వేస్తాడు. . .'

బాబిగాడి పక్కలోనించి కుక్కపిల్ల ఓ సారి లేచి మంచుని ఒళ్ళు విదిలించుకొని, బాబిగాడి మదురుమీద ఓ సారి నాకి, వాణ్ణి ఒరుసుకొని మళ్ళీ పడుకొంది.

ఇంతకూ ఇప్పు డెలా? చెల్లాయి పెళ్ళికి డబ్బు కావాలి. నాన్నకి ఏవో మందులు వాడాలిట. లేపోతే అదేదో జబ్బు పెరిగిపోతుందని మొన్న డాక్టరు చెప్పాడు. పిల్లల్ని స్కూల్లో చేర్పించాలి. వాళ్ళకి, నరుసుకి బట్టలు కొనాలి. తమ్ముడు చెప్పులు కొనుక్కోవాలి. నగలు విడిపించాలి. బాబిగాడి కుక్కపిల్లకి మెడపట్టీ, గొలుసు కొనాలిట. వీటన్నిటికీ డబ్బు కావాలి. . . ఎక్కడనించి వస్తుంది?. . . ఎలా సంపాదించటం?...

ఉయ్యాల్లో పాపాయి లేచి ఏడవటం మొదలుపెట్టాడు. నరుసువంటింట్లోంచి వచ్చి వాడిని జోకొట్టి, "ఇక లెండి! ఏడయింది టైము!" అనేసి మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది. కొత్తలో నరుసు ఇలా అనేదా? ఊహుఁ! తను నిద్ర పోతుంటే చక్కిలిగింతలు పెట్టి లేపి బెడ్‌కాఫీ ఇచ్చేది. తను వద్దని మారాం చేసేవాడు. అప్పుడు. . . ఓహో! అదంతా చక్కని కలలా అందంగా గడిచింది. అప్పుడే కొత్తగా ఉద్యోగంలో చేరాడు తను. అమ్మ తను కందిపోతాడేమో అన్నట్లుగా చూసుకునేది. . . చెల్లాయికీ, తమ్ముడికీ తనంటే ప్రాణం. అక్కయ్య ఎంతో ఆప్యాయంగా ఉత్తరాలు వ్రాస్తూండేది. పెద్దది తన దగ్గిరే కూర్చుని కబుర్లు చెబుతూండేది. కాని. . . ఇప్పుడు ఎవ్వరికీ తనక్కర్లేదు. అమ్మకీ, అక్కయ్యకీ తనంటే కోపం, పెళ్ళాంమాటలు విని తమ బాగోగులు చూడటంలేదనీ, వాళ్ళకి కావలిసినంత సహాయం చేయడంలేదనీనూ. తమ్ముడికి తనంటే అయిష్టం, వాడికి ఎప్పుడూ ఖర్చుకి డబ్బు ఇవ్వటం లేదని. నాన్నకి తనంటే ఉదాసీనం. ఇటు భార్యకి తనంటే

శాంతాక్లాస్ ఫోటో —శ్రీ పెమ్మరాజు నరశింహారావు





పాడుపడిన పాండవుల కోట (శ్రీనగర్)      ఫోటో — బి. డి. మెహరోత్రా (లక్నో)

నిర్లక్ష్యం. తనను, పిల్లలను గాలికి వదిలి, అంతా తల్లిదండ్రులకే పెడుతున్నాడని అనుమానం. తన నగలన్నీ పెట్టి డబ్బంతా వాళ్లకే ఖర్చు చేశాడని మంట. పిల్లలందరికీ వాళ్ల కోరిక లేవీ తీర్చలేకపోతున్నాడని అయిష్టం. కాని ఇందులో తన తప్పేమిటి? తనకి వచ్చే జీతంలో రెండు కుటుంబాలని భరిస్తూ సమానంగా చూడటమా? తనలో ప్రేమ, బాధ్యత, ఆపేక్షలను చంపుకో లేకపోవడమా? వీళ్లందరి కోసం తను ఇన్ని బాధలు పడుతున్నా, అందరికీ తనంటే అయిష్టం, కోపం, కసి, నిర్లక్ష్యం పేరుకుపోయాయి. ఎవ్వరినీ తృప్తి పరచలేక అందరికీ దూరమయ్యాడు. వీళ్లని సంతృప్తి పరచాలంటే డబ్బు కావాలి. వీళ్లకి తనతో పనిలేదు. కేవలం డబ్బు. . . అందుకు తనేం చేయాలి?... ఏం చేయగలడు? . .

*   *   *

సంవత్సరం గడిచిపోయింది.

ఇప్పుడు సరసు అత్తమామలతో కలిసి ఓ పెద్ద ఇంటిలో ఉంటూంది. ఒకళ్లమీద ఒకళ్లకి మనఃస్పర్థలు, అపోయలు లేవు. ఆమె పిల్లలందరూ బుద్ధిమంతుల్లా చదువుకొంటున్నారు. దేవదాసు చెల్లాయి వివాహం ఓ డాక్టరుతో వైభవంగా జరిగింది. ఇప్పుడు ఇంట్లో డబ్బు కొరవేమీ లేదు. కాని, ఎవ్వరి ముఖంలోనూ కళ లేదు. ఎవ్వరి పెదవుల మీదా చిరునవ్వు లేదు. ఇంట్లోవాళ్లెవరిని చూసినా బ్రతకటం కోసం బ్రతుకుతూన్న ట్లనిపిస్తుంది.

సరసు మరీ చిక్కి శల్యమయి పోయింది. పిచ్చిదానిలా తయారయింది. ఏమీ పట్టించుకోలేదు. ఎప్పుడూ తన గదిలో ఓ మంచంమీద పడుకొని ఏదో ఆలోచిస్తుంటుంది.

"మమ్మీ! ఈ ప్రోగ్రెస్ రిపోర్ట్ మీద సంతకం చెయ్యవూ?" అంటూ పిల్లలు ఆమె గదిలోకి పరిగెత్తుకొచ్చారు.

అన్నిటిమీద సంతకాలు చేసిం దామె. పిల్లు వెళ్లినవెంకే కాసేపు చూసి తలగడ కిందనించి ఓ కాగితం తీసి చేతుల్లో ఉంచుకొంది. ఆ ఉత్తరం మెల్లిగా చదువుతూంటే గుండెలు పిండేస్తున్నట్లు బాధగా ఉంది.

"సరసూ,

ఇలా చేస్తున్నందుకు నన్ను క్షమించవూ? ఇంతకంటె వేరే గత్యంతరం లేకపోయింది, సరసూ! మనం అందరం ఇలా దరిద్రంతో తన్నుల్లాడే బతికేకంటే నే నొక్కణ్ణే కొంచెం త్యాగం చేస్తే మీ రందరూ సుఖంగా బ్రతకవచ్చు కదా? అందుకే ఈ మార్గం ఆలోచించాను. నేను చాలా రోజుల క్రితం యాభై వేల రూపాయలకు భీమా చేశాను. ఇప్పుడు నేను చనిపోతే ఆ మొత్తం నీకు వస్తుంది. పిల్లలూ, నువ్వూ, అమ్మా, నాన్నా హాయిగా బ్రతకవచ్చు. కాని, నాది ఒక్క కోరిక. చెల్లాయి వివాహం మాత్రం ఘనంగా జరిపించు అమ్మా, నాన్నలను కనిపెట్టి ఉండు. అంతే! నువ్వు ఎటువంటి ఆత్మ హత్యాయత్నానికి తలపెట్టినా, నా ఆత్మకు శాంతి ఉండదు. పిల్లల కోసమయినా నువ్వు బ్రతకాలి. తప్పదు. . . చదివిన వెంటనే ఈ ఉత్తరం చింపి పారెయ్యి. . .

నీ

—దేవదాసు."

సరసు వెక్కివెక్కి ఏడ్చేస్తూంది.

'ఏమండీ! నన్నింత కఠినంగా ఎందుకు శిక్షించారు? ఈ పాపిష్ఠి డబ్బు కోసం లారీకింద పడి బలవంతంగా ప్రాణాలు తీసుకొంటారా? ఎందుకండీ? మీ కంటె నాకు డబ్బు ఎక్కువా? నన్నంత హీనంగా ఎలా ఊహించగలిగా రండీ? కనీసం నా ప్రాణాల్ని తీసుకోడానికి కూడా నా కధికారం లేకుండా చేశారే?...'

ఎదురుగా గోడమీద దేవదాసు ఫోటో ముందు అగరువత్తులు వెలుగుతున్నాయి. పూలహారం గాలికి ఊగుతూంది. సరసు కళ్లు తిరుగుతున్న ట్లనిపించింది. ఉక్కిరి బిక్కి రవుతూంది.

గదిగుమ్మం బయట నుంచున్న నౌఖరు గట్టిగా కేకవేశాడు

"పెద్దమ్మ ! ఈవిడికి మళ్లీ మూర్ఛ వస్తుంది. . ." ★